వేసవిలో పత్తి సాగుపై రైతుల దృష్టి

- నియోజకవర్గంలో 10 వేల ఎకరాలకుపైనే సాగు
- సాగులో ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు
- సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు
- వ్యవసాయ బోర్లు, బావుల కింద సాగు


నీటిపారుదల కింద సాగైన పత్తి


డ్రిప్ కింద సాగు చేసిన పత్తి పంట

వేముల : ఈ ఏడాది వేసవి పత్తి సాగుపై రైతులు దృష్టి సారించారు. పులివెందుల నియోజకవర్గంలో విస్తారంగా పత్తి సాగవుతోంది. మామూలుగా ఏప్రిల్ మొదటి వారంలో పత్తి సాగు చేసే రైతులు మార్చి నుంచే సాగుపై దృష్టి పెట్టారు. వ్యవసాయ బోర్లు, బావుల కింద విస్తారంగా పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. వేసవిలో అరి, మిరప, పత్తి పంటలను మాత్రమే సాగు చేయవచ్చు. ఈ పంటల సాగుకు ఇదే అదును. దీంతోనే రైతులు పత్తి సాగు ముమ్మరం చేశారు. పత్తి పంటను డ్రిప్ ద్వారా, నీటి పారుదల కింద సాగు చేశారు. ఇప్పటి నుంచి జూన్ వరకు భూములను బీళ్లుగా ఉంచలేక రైతులు పత్తి పంటను ఎంచుకుంటున్నారు. అయితే పత్తి సాగు చేశాక వేసవిలో నీటితడులు అందించడం రైతులకు భారంగా మారుతోంది.

నియోజకవర్గంలో 10వేల ఎకరాల్లో సాగు

వేసవిలో పులివెందుల నియోజకవర్గంలో 10 వేల ఎకరాలకుపైనే సాగవుతోంది. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగా పత్తి సాగు చేస్తారు. ఎక్కువగా నాయక్, ఆర్మీ, సూపర్ బంటు, నందిని, తేజ తదితర రకాలను ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తారు. పత్తి సాగు చేసినప్పటి నుంచి దిగుబడులు వచ్చేవరకు నీటితడులు ఇవ్వాల్సి ఉంటుంది. ముంగారు వర్షాలు రాకపోతే ఎక్కువ తడులు నీటిని ఇవ్వాల్సి ఉంటుంది. పంట కాపునకు వచ్చే దశలో వర్షాలు పడితే పంట ఏపుగా పెరుగుతుందని వర్షాలు లేకపోతే పంట గిటకబారిపోతుందని రైతులు అంటున్నారు. వేసవిలో పంట మొలకెత్తాక ఉష్ణోగ్రతలకు పత్తి దెబ్బతినకుండా తట్టుకుంటుందనే సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు

పత్తి సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ.30 వేలకుపైనే సాగులో రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. పంట సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు అందుతాయి. దిగుబడులు ప్రారంభమైన 40 రోజులకు పూర్తిగా చేతికి వస్తాయి. పంట సాగు చేసిన నెల రోజులకే సాగులో కలుపు తీయడం, సాగు చేసిన 50 రోజుల నుంచే తెగుళ్ల నివారణ మందులు పిచికారి చేయడంతో పెట్టుబడులు అవుతున్నాయి. దిగుబడులు వచ్చే సమయానికి నాలుగైదు సార్లు పురుగు మందులను పిచికారి చేస్తున్నామని రైతులు అంటున్నారు. సాగులో పత్తి తీసేందుకు కూలీలు ఖర్చులు అదనంగా వస్తున్నాయని దీంతోనే పెట్టుబడులు ఎక్కువగా వస్తున్నాయని రైతులు అంటున్నారు.

దిగుబడులు బాగా ఉంటాయనే ఆశతో

పత్తి సాగులో దిగుబడులు బాగా ఉంటాయనే ఆశతోనే రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. గత ఏడాది ఎకరాకు 13 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ప్రతి ఏడాది నూతన పత్తి వంగడాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఎక్కువగా రైతులు కొత్త వంగడాలను సాగు చేస్తున్నారు. మార్కెట్‌లోకి వచ్చిన మొదటి ఏడాది దిగుబడులు ఉంటాయనే దిశగా మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది కూడా ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు ఉంటాయనే ఆశ రైతులలో ఉంది. సాగు చేశాక వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే దిగుబడులు పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రతి ఏడాది పత్తి సాగు రైతులకు ఊరటనిస్తోందనే చెప్పవచ్చు.

మార్కెట్ ధరలు ఉంటే సాగులో ఆదాయమే

పత్తికి మార్కెట్‌లో ధరలు ఉంటే ఆదాయం ఉంటుంది. గత ఏడాది క్వింటా రూ.7,300ల నుంచి రూ.8200ల వరకు ధర పలికింది. సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతుకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మార్కెట్ ధరలు ఉంటాయనే ఆశతో రైతులు ఉన్నారు. నియోజకవర్గంలోని వేముల మండలంలోనే 5వేల ఎకరాలకుపైనే పత్తి సాగవుతుంది. ఈ ప్రాంతం వేసవి పత్తి సాగుకు అనుకూలం. దీంతోనే మండల రైతులు వేసవి పత్తిని ఎంచుకుంటున్నారు.

పత్తిలో ఆదాయం ఉంటుందనే సాగు చేశా



ఈ ఏడాది పత్తి పంటలో ఆదాయం ఉంటుందనే సాగు చేశా. పంటలో తెగుళ్ల నివారణ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకోసం నాలుగైదు సార్లు మందులను పిచికారి చేస్తాం. ఎకరాకు 13క్వింటాళ్లకుపైనే దిగుబడులు వస్తాయనే ఆశతో ఉన్నాం. మార్కెట్ ధరలు నిలకడగా ఉంటే పత్తి సాగు ఆదాయమే.

– అంకిరెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

పత్తి సాగుతో రైతులకు ఊరటే



వేసవి సీజన్‌లో పత్తి సాగు రైతులకు ఊరటే. సాగులో దిగుబడులు ఉండి ధరలు ఉంటాయనే ఆశతో పత్తి సాగు ఎంచుకుంటున్నారు. ఈ ఏడాది మండలంలో పత్తి సాగు పెరిగే అవకాశం ఉంది. ఎక్కువ మంది రైతులు పత్తి సాగుపైనే దృష్టి పెట్టి సాగు చేస్తున్నారు. పత్తి సాగులో సకాలంలో తెగుళ్లను నివారిస్తే దిగుబడులు ఉంటాయి.

– చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి, వేముల

క్లుప్తంగా

దరఖాస్తులకు ఆహ్వానం

చక్రాయపేట : చక్రాయపేటలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గౌస్‌ప్యారి తెలిపారు. తమ పాఠశాలలో 6వ తరగతిలో 40, 7వ తరగతిలో 5, 9వ తరగతిలో 5, 10వ తరగతిలో 2, ఇంటర్‌మీడియట్ మొదటి బైపీసీ గ్రూపులో సంవత్సరం 40, ద్వితీయ సంవత్సరంలో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హులైన బాలికలు ఏప్రిల్ 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్ష వాయిదా

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఈనెల 16వ తేదీకి వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు గమనించి సహకరించాలన్నారు.

వడదెబ్బ నివారణపై సమీక్ష


వడదెబ్బ నివారణపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన మండలస్థాయి అధికారులతో వడదెబ్బ నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలపై అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వీల్ చైర్ అందజేత


వీల్ చైర్‌ను అందిస్తున్న దివ్యాంగులు జనార్దన్‌రెడ్డి

పులివెందుల : పట్టణంలోని వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రికి మంగళవారం దివ్యాంగులు జనార్దన్‌రెడ్డి దాతలు అందజేసిన వీల్‌చైర్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రత్యూష, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పవన్, ఆర్ఎంఓలు డాక్టర్ నవీన్, డాక్టర్ సుకన్య, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

ఎర్రగుంట్ల : మండలంలోని సమస్యలపై అధికారులు శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మండల ఉపమండలాధ్యక్షుడు మల్లు వెంకటమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మండలంలోని సమస్యలను పరిష్కరించేవిధంగా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలు, సంక్షేమ స్కీంలను వివరించారు.

వాహనాలు ఢీ.. ఇరువురికి గాయాలు


ప్రమాదానికి గురైన వాహనాలు

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారి మంగపట్నం సమీపంలో మంగళవారం లారీ–బొలేరో వాహనంలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లోని ఇరువురికి గాయాలయ్యాయి. తాడిపత్రి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవరు సతీష్‌కుమార్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టి అతనిని బయటకు తీశారు. బొలెరో డ్రైవరు తాడిపత్రి సమీపంలో యర్రగుంట్లపాలెంకు చెందిన రాజేష్‌లు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో వాహనాలు రెండు దెబ్బతిన్నాయి. క్షతగాత్రులిద్దరినీ చికిత్స కోసం తాడిపత్రికి తరలించారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

చక్రాయపేట : మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు పోషణ భీ, పడాయి భీపై మూడు రోజుల పాటు వేంపల్లె ఉర్దూ పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుభద్ర, నాగసుభాషిణి, సువర్ణలతలు తెలిపారు. ఇందులో తొలిరోజు నవచేతన కింద 0 నుండి 3 సంవత్సరాల పిల్లలకు సమగ్ర సేవల గురించి, ఆదార్శ్ కింద 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు శారీరక, మానసిక, సామాజిక నైతిక విలువలు, ఆట పాటల ద్వారా విద్యాబోధనపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

సమస్యలు లేవనడం సరైంది కాదు

మైలవరం : దాల్మియా ఫ్యాక్టరీ వల్ల మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం ఎటువంటి సమస్యలు లేవని చెప్పడం సరికాదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ప్రమాదంలో తలకు గాయమై చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన హరిని ఆయన నవాబుపేటకు వెళ్లి పరామర్శించి మాట్లాడారు. ఈనెల 27వ తేదీన దాల్మియా విస్తరణ పనులకోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయడం సరైంది కాదన్నారు. స్థానిక ప్రజలకు సంబంధించిన ఎన్నో సమస్యలు కనిపిస్తున్నా అధికారులకు మాత్రం అవి ఏమాత్రం కనిపించడం లేదన్నారు. దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్లాస్టింగ్ వల్ల నవాబుపేట గ్రామంలో ఎన్నో ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. దాల్మియా యాజమాన్యం అక్రమంగా వంకలు, వాగులను అక్రమించి నిర్మాణాలు చేపట్టింది. దీంతో వర్షకాలంలో వరద నీరు గ్రామాల్లోకి వచ్చి చేరుతుంది. ఈనెల 27వ తేదిన జరుగబోయే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని ఆయన తెలిపారు.

ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరందించాలి

జెడ్పీ సీఈవో ఓబుళమ్మ


సీపీడబ్ల్యూ పథకంను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో, ఎంపీడీవో, డీఈ

ముద్దనూరు : సీపీడబ్ల్యూ పథకం ద్వారా మండలంలోని ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరందించాలని, దీనికి సంబంధించి 15 రోజుల్లో సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబుళమ్మ ఆదేశించారు. మంగళవారం సీఈవో మండలానికి తాగునీరందించే సీపీడబ్ల్యూ పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడే సిబ్బందితో సమావేశమయ్యారు. గండికోట జలాశయం నుంచి సరఫరా అయ్యే శుద్ధి నీటిని అందరికీ అందేలా చూడాలని, మండలంలోని అన్ని రకాల నీటి ట్యాంకులను శుభ్రపరచి అందులో తాగునీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కొందరు సిబ్బంది నీటిని పశువులకు, ఇతర అవసరాలకు వాడుతున్నారని సీఈవో దృష్టికి తెచ్చారు. ప్రజలంతా ఈ నీటిని వాడేలా వారికి అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముకుందరెడ్డి, ఈవోపీఆర్డీ వీరభద్రుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీలో 50 శాతం రాయితీతో పన్నులు చెల్లించండి

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇప్పటి వరకు ఉన్న బకాయిలకు సంబంధించిన వడ్డీలో 50 శాతం రాయితీతో పన్నులు చెల్లించాలని కమలాపురం మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓఎంఎస్ నెంబర్ 46 ప్రకారం ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే ఈనెల 30, 31వ తేదీల్లో శెలవు ఉన్నప్పటికి మున్సిపల్ కార్యాలయం పనిచేస్తుందని, పన్నులు చెల్లించవచ్చునన్నారు. అలాగే పన్నులను సీడీఎంఎ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చునన్నారు.

జమ్మలమడుగు..

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను గతంలో ఉన్న పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ అవుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే చెల్లించిన వారు ఎవరైనా ఉంటే వారికి వచ్చే ఏడాది వడ్డీలో 50 శాతం మాఫీ సర్దుబాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

27న లబ్ధిదారులతో సమావేశం

రాష్ట్ర ప్రభుత్వం పీఎంఆర్‌వై, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణం చేపట్టే లబ్ధిదారులతో ఈనెల 27వ తేదీన మండల పరిధిలోని అంబవరం సమీపంలో నిర్మిస్తున్న హౌసింగ్‌కాలనీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ మహేశ్వరరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రూ.50వేలు, రూ.75వేలు ఇస్తారన్నారు. లబ్ధిదారులు గురువారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హాజరుకావాలన్నారు.

పండ్లతో ఆరోగ్యం పదిలం


విద్యార్థులకు పండ్లను అందజేస్తున్న వైద్యులు

జమ్మలమడుగు రూరల్ : ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో డీహైడ్రేషన్‌కు లోనుకాకుండా విద్యార్థులు తాజా పండ్లు తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో దోహదపడుతాయని హోమియో వైద్యులు పి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం వేపరాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహులు ఫ్రూట్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వారిలో రోగ నిరోధకశక్తి వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పండ్లను ఆయన పంపిణీ చేశారు.

వాహనదారులు తప్పక లైసెన్స్ కలిగి ఉండాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీసు సిబ్బంది

సింహాద్రిపురం : వాహనదారులు తప్పక లైసెన్స్ కలిగి ఉండటంతోపాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని, లేదంటే జరిమానాలు తప్పవని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం గురజాల రోడ్డులోని వైఎస్ విగ్రహం సెంటర్ వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహన పత్రాలు, లైసెన్స్‌లు లేని వారికి, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించారు. అలాగే తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

12 గొర్రెలు మృతి



తొండూరు : ప్రమాదవశాత్తు యూరియా నీరు తాగి 12 గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని మడూరు గ్రామంలో ఓ రైతుకు చెందిన చీనీ తోటలో యూరియా కలిపిన నీటిని గొర్రెల కాపరి వెంకటేష్‌కు చెందిన 12 గొర్రెలు తాగడంతో మృత్యువాత పడ్డాయి. గొర్రెల మృతితో లక్షలాది రూపాయలు నష్టపోయానని గొర్రెల కాపరి ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రమాదంలో పశువైద్య సహాయకుడికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట సచివాలయ పశువైద్య సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న శివలింగేశ్వరరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మంగపట్నం గ్రామానికి చెందిన శివలింగేశ్వరరెడ్డి సోమవారం రాత్రి మోటార్‌బైక్‌లో ఇంటికి వెళ్తుండగా జాతీయ రహదారిలో బైక్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తలకు గాయమైంది. ప్రొద్దుటూరులో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

వేంపల్లె : వేంపల్లెలోని స్థానిక కడప రోడ్డులోని గాజులపేట వద్ద బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. వేంపల్లి పట్టణంలో చైతన్యనగర్ వీధిలో ఉన్న వై.జగదీశ్వర్ రెడ్డి, తండ్రి శివారెడ్డిలు మోటార్ బైకులో అగ్రహారం గ్రామంలోని పొలం వద్దకు వెళ్లి తిరిగి వేంపల్లెకు వస్తుండగా గాజులపేట వద్ద గుర్తుతెలియని యువకులు అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. దీంతో జగదీశ్వ ర్‌రెడ్డి కాలికి, గడ్డానికి గాయాలయ్యాయి. అలాగే బైకు లో వెనకవైపు ఉన్న తండ్రి శివారెడ్డి తలకు తీవ్ర గా యాలయ్యాయి. స్థానికులు గమనించి హుటా హుటి న వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడపకు పంపించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని మార్లెమడక బీసీ కాలనీ సమీపంలో మంగళవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో రాజారెడ్డి, చక్రినాయక్ అనే విద్యుత్‌శాఖ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉండటంతో వేంపల్లెలో ప్రథమ చికిత్స చేయించి కడపకు తరలించారు.

బహిరంగ వేలం పాట

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు చెందిన గొర్రెలు, మేకల వధశాల, ఎద్దుల వధశాలలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో కె. అలావుద్దీన్ అనే వ్యక్తి రూ.12.23లక్షలకు గొర్రెల, మేకల వధశాల గుత్తను సొంతం చేసుకున్నారన్నారు. కె.కరిమూన్ అనే మహిళ రూ.3.93లక్షల హెచ్చుపాట పాడి ఎద్దుల వధశాల గుత్తను పొందారన్నారు. పాత కూరగాయల మార్కెట్, కొత్త కూరగాయల మార్కెట్, బీఫ్ స్టాల్స్, మటన్ స్టాల్స్‌కు సంబంధించిన వేలాన్ని 29వ తేది మధ్యాహ్నం 3 గంటలకు నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 28వ తేది సాయంత్రం 5 గంటల్లోపు డిపాజిట్ చెల్లించి రశీదులు, అప్లికేషన్లు సమర్పించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాను గంజాయి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యంగా విశాఖ పట్నం, విజయవాడ నుంచి కడపకు వచ్చే రైళ్లు, బస్సులు, పార్శల్ కేంద్రాల్లో పోలీస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం విశాఖపట్నం నుండి కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు.

ఇంటింటికో స్పీడ్ బ్రేకర్..


ఎక్కువగా స్పీడ్ బ్రేకర్లు ఉన్న రోడ్డు

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడివీధి నుంచి గూడుమస్తాన్ దర్గాకు వెళ్లే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ రహదారిలో 30 మీటర్ల దూరంలోనే నాలుగు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి గురువారం, శుక్రవారం చాలా మంది భక్తులు గూడుమస్తాన్‌వల్లి దర్గాకు, దస్తగిరిస్వామి దర్గా వద్దకు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ఈ రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఎక్కువ ఎత్తులో ఉండటంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోండి


వేరు శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : సొంత భూములు కలిగిన రైతులందరూ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని గంగవరం, విభరాపురం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి కొర్ర, వేరుశగన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరు శనగ పంట విత్తిన 40–50 రోజుల మధ్య ఏకరానికి 200 కిలోల జిప్సం పొలంలో చల్లుకోవాలన్నారు. తద్వారా గింజ పరిమాణంతో పాటు నూనె శాతం పెరుగుతుందన్నారు. ఆకుమచ్చ నివారణకు 400 గ్రాముల మంకోజెబ్, 200 గ్రాములు కార్బెండిజం, లేదా హెక్సా కోనోజోల్ 5శాతం ఎస్సీ 400 మిల్లీ లీటర్లు 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే సొంత భూములు కలిగిన రైతులందరూ సంబంధిత ఆర్ఎస్‌కేలకు వెళ్లి ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలన్నారు. మనుషులకు ఆధార్‌లాగే ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ సంఖ్య తప్పని సరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకట కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ‘టీడీపీ’ ఏనాడూ పోరాడలేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు

పులివెందుల రూరల్ : రైతుల సమస్యల కోసం టీడీపీ నాయకులు ఏనాడూ పోరాడలేదని చంద్రబాబు దగ్గర మెప్పు పొందేందుకు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలు పోటాపోటీగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబురెడ్డి, రైతు విభాగపు అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖరరెడ్డిలు తెలిపారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం మాట్లాడారు. గాలి, వానలకు దెబ్బతిన్న పంటలు విషయం తెలుసుకుని, పంటలను పరిశీలించేందుకు, రైతులను ఓదార్చేందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు పంట పొలాలను పరిశీలించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చిత్రావతికి నీరు తెప్పించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. కృష్ణా జలాలు లింగాల కుడి కాలువ ద్వారా విడుదల చేయడంతో బోర్లలో నీరు నిల్వ ఉండేదన్నారు. చిత్రావతికి 5 టీఎంసీల నీరు ఉంటే ప్రతి చివరి ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా 10 టీఎంసీల నీటిని తెప్పించిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుందన్నారు. రైతుల సమస్యల కోసం పులివెందుల ప్రాంత ప్రజల కోసం మీరు ఏనాడైనా పోరాడారా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు ప్రజలందరికీ అబద్ధపు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలందరినీ మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ఎమ్మెల్సీకి, మాజీ ఎమ్మెల్సీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్ష రూపాయల పరిహారం ఇప్పించాలన్నారు. చౌకబారు విమర్శలు మానుకోవాలని వారు హితవు పలికారు. ఇక్కడ పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు రూ.25 కోట్లతో పులివెందుల ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌ను కట్టించిన ఘనత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వెలిదండ్ల నుంచి తాతిరెడ్డిపల్లె ప్రాంతాలకు సొంత నిధులతో పనులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పులివెందుల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో సుమారు రూ.500 కోట్లతో మెడికల్ కళాశాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేంద్రం 50 మెడికల్ కళాశాల సీట్లు కేటాయించిన వాటిని వెనక్కి పంపించిన ఘనత టీడీపీ నాయకులదేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, మల్లికేశవరెడ్డి, హేమాపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కరెంటు వేళల మార్పుతో అగచాట్లు

సింహాద్రిపురం : మండలంలో రైతాంగానికి గతంలో ఉదయం 5.15 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 నిమిషాల వరకు అందించేవారు. దీనితో రైతు ఏ పనులు చేసుకోవాలన్నా సమయం ఆదా అవుతుండటంతోపాటు ఎంతో సౌలభ్యంగా ఉండేదని రైతులు అంటున్నారు.

అయితే గతనెల నుంచి ఉదయం 8:15 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు వ్యవసాయానికి కరెంటు అందించడంతో రైతులకు ఆగచాట్లు మొదలయ్యాయి. ఈ విద్యుత్ వేళలో మార్పు చేయడంతో ఉదయం పూట పొలం పనులు చేయడానికి వచ్చే కూలీల తాగునీటికి, అలాగే కూలీలతో పనులు చేయించాలన్న ఆ సమయానికి రావడంలేదని వాపోతున్నారు. అలాగే రైతుకు వేర్వేరు తోటలు ఉండేవారికి చాలా కష్టమవుతోందన్నారు. ఉదయం పూట కరెంటుతో రైతు పనులన్నీ చేసుకుంటూ పొలానికి నీరు కట్టుకోవడానికి సౌలభ్యంగా ఉండేదన్నారు. యథావిధిగా అప్పటి వ్యవసాయ విద్యుత్ సమయాన్ని ఏర్పాటు చేయాలని రైతులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు. అలాగే విద్యుత్ వినియోగదారులకు కరెంట్ బిల్లుపై వచ్చే క్యూఆర్ కోడ్ సరిగా ముద్ర చేయని కారణంగా కొంతమంది వినియోగదారుల కరెంట్ బిల్లు క్యూఆర్ కోడ్ తీసుకోవడం లేదన్నారు. ఇవి కరెక్ట్‌గా వచ్చేట్లు చూడాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.